మరింత బాధ్యతగా పని చేస్తా..

గాజులరామారం డివిజన్‌లో ఎమ్మెల్యే వివేకానంద్ కృతజ్ఞత యాత్ర

దుండిగల్, జనవరి 18 : తనపై ప్రేమ, నమ్మకంతో అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం కట్టబెట్టిన నియోజకవర్గం ప్రజలకు ధన్యవాదాలు తెలిపేందుకు తాను కృతజ్ఞతయాత్రను నిర్వహిస్తున్నట్లు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. యాత్రలో భాగంగా గురువారం ఆయన గాజులరామారం డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్-ఏ, బీ, సుభాష్ చంద్రబోస్‌నగర్, రొడమిస్త్రీనగర్-బి, ఎన్‌టీఆర్‌నగర్-ఏ, బేకరిగడ్డ, దర్శార్‌మైసమ్మబస్తీ, ఎఫ్ఎం, ఫంక్షన్‌హాల్, లెనిన్‌నగర్ గడ్డా, ఉమాదేవి నగర్, అంబేద్కర్‌నగర్, పెంటయ్యబస్తీ, ఇంద్రానగర్-ఏ, బీ, ప్రకాశంపంతులునగర్, భవానీనగర్, ప్రొ.జయశంకర్ నగర్, చిత్తారమ్మదేవి నగర్, పీఎం రెడ్డినగర్, సుందరయ్యనగర్ బస్తీలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గడిచిన తొమ్మిదిన్నరేండ్ల కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తనను ఇక్కడి ప్రజలు రికార్డుస్థాయి మెజార్టీతో గెలిపించారన్నారు. ఈ విజయం తనపై మరింత బాధ్యతను పెంచిందని, ప్రజలు చూపిన ఆదరాభిమానాలతో నియోజకవర్గాన్ని రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు విజయరాంరెడ్డి, పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, వార్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘కృతజ్ఞత యాత్ర’కు విచ్చేసిన ఎమ్మెల్యే వివేకానంద్‌కు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న కాలనీసంక్షేమసంఘం ప్రతినిధులు

ఎమ్మెల్యేను కలిసిన ప్రజలు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, యువజన సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు గురువారం ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.

స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం

గాజులరామారం డివిజన్ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో ముస్లిం మేనేజ్‌మెంట్ స్కూల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 3వ మౌలానా ఆజాద్ మెమోరియల్ స్పోర్ట్స్‌మీట్‌ను ఎమ్మెల్యే వివేకానంద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు క్రీడాకారులలో కలిసి ఆయన క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, స్పోర్ట్స్‌మీట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

షాపింగ్‌కు వెళ్లి వస్తానని.. ఇద్దరు గృహిణులు అదృశ్యం

శేరిలింగంపల్లి, జనవరి 18 : షాపింగ్‌కు వెళ్లి వస్తానని ఇద్దరు గృహిణులు ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ సంఘటన గురువారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీదర్‌కు చెందిన బాజారావు సంతోషి (24) భర్తతో కలిసి బీదర్‌లో నివాసం ఉంటుంది. గత ఐదురోజుల కిందట సంక్రాంతి పండుగకు గౌలిదొడ్డిలోని తన తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. అదే ఇంట్లో నివాసం ఉంటున్న ఆమె వదిన వైష్ణవి(22) కుటుంబసభ్యులతో కలిసి గౌలిదొడ్డిలో నివాస ఉంటుంది. ఈనెల 17వ తేదీన ఇద్దరు కలిసి మధ్యాహ్నం 12 గంటల సమయంలో షాపింగ్‌కు కోరికి వెళ్లివస్తామని ఇంట్లో చెప్పి వెళ్లారు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. అనుమానం వచ్చి ఫోన్ చేయడంతో ఇరువురి ఫోన్‌లు స్విచ్ఛాఫ్ వస్తున్నాయి. రాత్రి వరకు ఎదురు చూసినా ఇంటికి రాకపోవడంతో బాజారావు సంతోషి తండ్రి బాజారావు మహదీవ్ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో తన కూతురు సంతోషి, కోడలు వైష్ణవిలు షాపింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొవిడ్ పరీక్షలు

కొండాపూర్, జనవరి 18 : కొండాపూర్‌లోని రంగారెడ్డి జిల్లా దవాఖానలో కొవిడ్ వైద్య సేవలు కొనసాగుతున్నాయని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిణి రెడ్డి తెలిపారు. గురువారం వైద్య పరీక్షల్లో భాగంగా 1035 జనరల్ టెస్టులు నిర్వహించగా, 8 మంది కొవిడ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కాగా, పాజిటివ్ కేసులు నమోదు కాలేవన్నారు.

8న తుది ఓటర్ల జాబితా విడుదల

శేరిలింగంపల్లి, జనవరి 18 : శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో 18 ఏండ్లు నిండిన యువతీయువకులు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని డీసీ రజనీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో సవరణ, కొత్త ఓటరు నమోదు ప్రక్రియలు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈనెల 22వ తేదీ వరకు మాత్రమే ఈ అవకాశం ఉందన్నారు. శని, ఆదివారాల్లో పీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని సూచించారు. తుది ఓటరు జాబితా ఫిబ్రవరి 8వ తేదీన వెల్లడవుతుందన్నారు.

సమావేశం నిర్వహిస్తున్న డీసీ రజనీకాంత్ రెడ్డి

సోలార్ పనులు సకాలంలో పూర్తి చేయాలి

సోలార్ ఏర్పాటు పనులను నేతలతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్, జనవరి 18: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట సిరాజుల్ ఉల్లోమ్ మదర్స అండ్ మసీద్‌లో ఏర్పాటు చేస్తున్న సోలార్ పనులను సకాలంలో పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు. గురువారం స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్‌తో కలిసి ఆయన సోలార్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మసీద్‌లలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వలన విద్యుత్ వినియోగం ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఇర్ఫాన్, నియోజకవర్గం మైనార్టీ నేత సయ్యద్ ఎజాజ్, మక్కల నర్సింగ్, హరినాథ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకులకు ఎమ్మెల్యే పరామర్శ

అల్లాపూర్, జనవరి 18 : రెండు వర్గాల మధ్యన ఈనెల 14వ తేదీన జరిగిన గొడవలో హరినగర్‌కు చెందిన యువకులకు తీవ్రగాయాలై చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం యువకులను పరామర్శించి, గొడవకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ జరిగి నిందితులకు శిక్షపడేలా చేసి బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పోలీసులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు లింగాల అయిలయ్య, నాగుల సత్యం, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన ప్రజలు

దుండిగల్, జనవరి 18 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, ప్రజలు గురువారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తున్నానని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలతోపాటు దుండిగల్ మున్సిపాలిటీలోని వివిధ వార్డులకు చెందిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, యువజన సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు గురువారం ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.

– దుండిగల్, జనవరి 18

దేవాలయాల్లో స్వచ్ఛతను చేపట్టాలి

అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశంలోని ఆలయాలన్నింటినీ ఉద్యమంలా శుభ్రం చేయాలని బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. గురువారం స్వచ్ఛత భారత్ అభియాన్‌లో భాగంగా కేపీహెచ్‌బీ కాలనీ 9వ రోడ్డులోని శివాలయాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలతో కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, ఆలయ కమిటీ చైర్మన్ పి.వి.శ్రీరమణ, బాలాజీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి.వినోద్‌కుమార్, రవి, సూరిబాబు పాల్గొన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 18

అయోధ్య రాములవారికి పట్టువస్త్రాలు

కొండాపూర్, జనవరి 18 : అయోధ్యలో సీతారామచంద్ర స్వాముల ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా గురువారం తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ పట్టు వస్త్రాలను పంపినట్లు రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర తెలిపారు. గచ్చిబౌలిలోని రాష్ట్ర సగర సంఘం కార్యాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు మర్క సురేశ్ ద్వారా పట్టు వస్త్రాలను పంపించినట్లు తెలిపారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కుత్బుల్లాపూర్, జనవరి 18 : కుత్బుల్లాపూర్ మండల మైనార్టీ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతితోపాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో విద్యార్థులు చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.వనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో సీఈసీ, ఎంఈసీలకు, 6, 7, 8 తరగతుల్లోనూ మైనార్టీ, నాన్‌మైనార్టీలు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. 5వ తరగతిలో చేరే విద్యార్థులు ముందుగా వచ్చిన వారికి సీట్లు కేటాయించనున్నామని, తర్వాత వచ్చిన వారికి లక్కీడ్రా సీట్లను కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, మరిన్ని వివరాలకు 73311 70803, 95553 158618 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్

మోతినగర్ చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట/కేపీహెచ్‌బీ కాలనీ/కొండాపూర్/అల్లాపూర్, జనవరి 18: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మూసాపేట డివిజన్ మోతినగర్ చౌరస్తాలో డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కృష్ణారావు హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీహెచ్.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి తిరుపతి, చక్రపాణి, రాజ్‌కుమార్, మోహన్‌రెడ్డి, ఉదయ్, సత్యనారయణ, కండోదర్, వెంకటేశ్వరరావు, అబ్బులు, ధర్మయ్య, ఇంద్రకుమార్, శేఖర్, రాము పాల్గొన్నారు.

- ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా వసంతనగర్ కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి కేపీహెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- జేఎన్‌టీయూహెచ్ చౌరస్తాలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండి రమేశ్, టీడీపీ నేతలు షేక్ సత్తార్, అట్లూరి దీపక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు పండ్ల పంపిణీ చేశారు.
- కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేత కట్టా నరసింగరావు, కె.నారాయణరాజు, కొల్లా శంకర్, సాంబశివరావు పాల్గొన్నారు.
- చందానగర్‌లోని టీడీపీ నియోజకవర్గం కార్యాలయంలో ఇన్‌చార్జి కట్ట వెంకటేశ్‌గౌడ్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ సుభాషిని, డివిజన్‌ల అధ్యక్షులు ఏరువ సాంబశివ గౌడ్, బీఎస్ఎన్ కిశోర్ యాదవ్, కడియాల రాజేందర్‌బాబు, చిట్టిబాబు, బాలాజీ, సోమ మధుమోహన్, శ్రీనివాసరావు, రామారావు, రామకృష్ణగౌడ్, రాహుల్‌గౌడ్, వెంకటేశ్వర్లు, క్రాంతి, అభిమానులు పాల్గొన్నారు.
- ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ మోతీనగర్ ప్రధాన కూడలి వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపిశెట్టి రాఘవేందర్, సతీశ్ గౌడ్, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ చెరగని ముద్ర

ఎల్లమ్మబండ చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలతో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

శేరిలింగంపల్లి/కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 18 : తెలుగువారి గుండెల్లో చెరగని ముద్ర వెసుకొని చిరస్థాయిగా నిలిచిన ఘనత సర్దీయ ఎన్టీఆర్‌కే దక్కిందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని నియోజకవర్గం పరిధిలోని వివేకానందనగర్ డిజివిన్‌లో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, రంగారావు, ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండా ప్రాంతాల్లో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ హాజరై ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, గొట్టిముక్కల బాస్కర్‌రావు, దొడ్ల రామకృష్ణగౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో..

ఎన్టీఆర్ సమాజానికి అందించిన సేవలు మరువలేనివని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ చౌరస్తాలో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మాదాపూర్, జనవరి 18: గుర్తు తెలియని వ్యక్తి కేబుల్ బ్రిడ్జి పైనుంచి దుర్గంచెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ప్రయాణికులు బోటింగ్ బృందంతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గాలింపు చర్యలు చేపట్టిన లేక్ పోలీసులు మృతదేహాన్ని గురువారం వెలికితీసి పోలీసులకు తెలుపడంతో మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి వయస్సు సుమారు 35 ఏండ్లు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటోడ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపాలి

సమావేశంలో ఆటోడ్రైవర్లు, ఏఐటీయూసీ నేతలు

జగద్గిరిగుట్ట, జనవరి 18 : తమకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఆదాయ మార్గం చూపాలని పలువురు ఆటోడ్రైవర్లు కోరారు. ఐడీపీఎల్ చౌరస్తా నుంచి గండిమైసమ్మ వైపు ఆటోలు నడిపించే పలువురు గురువారం ఐడీపీఎల్ చౌరస్తాలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సమావేశమయ్యారు. సంఘం నేతలు మాట్లాడుతూ.. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటోల ఆదాయం తగ్గిపోయిందన్నారు. హరినాథ్, ఉమామహేశ్, ప్రవీణ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కొంపల్లిలో ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

కుత్బుల్లాపూర్, జనవరి 18 : కొంపల్లిలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం తెల్లవారుజామున చొరబడి చోరీకి యత్నించిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఉదయం ఏటీఎంకు వచ్చిన కస్టమర్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందివ్వగా.. డీఐ రాజు నేతృత్వంలో ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

కొండాపూర్, జనవరి 18 : శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపనపల్లి సర్వే నం.34లోని ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులపై చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నిస్తున్న విషయం తెలుసుకున్న మండల గిరిధవార్ ఎస్.రాంబాబు చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు గోపనపల్లి సర్వే నంబర్ 34లోని ప్రభుత్వ భూమిలో కబ్జాకు యత్నిస్తున్నారని, వెంటనే వారిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి గాజులరామారం చిత్తారమ్మదేవి జాతర

ఏర్పాట్లు పరిశీలించిన బాలానగర్ జోన్ ఏసీపీ గంగారాం

గాజులరామారం చిత్తారమ్మదేవి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

దుండిగల్, జనవరి 18 : గాజులరామారంలోని చిత్తారమ్మ జాతర(బ్రహ్మోత్సవాలు) శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ అనంతరం వచ్చే ఆదివారం రోజున అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. అందులో భాగంగానే తొమ్మిది రోజుల పాటు అంటే ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నగర శివారుతోపాటు మహానగరం చుట్టూ ఉన్న జిల్లాలకు చెందిన లక్షలాది మంది భక్తులు ఈ వేడుకల్లో పాల్గొంటారు. వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మున్సిపల్ అధికారులు, పోలీస్ యంత్రాంగంతో కలిసి తగిన ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఏర్పాట్లను సమీక్షించిన ఏసీపీ

చిత్తారమ్మ జాతర ప్రారంభం నేపథ్యంలో గురువారం బాలానగర్ జోన్ ఏసీపీ గంగారం, జీడిమెట్ల సీఐ శ్రీనివాసరావుతో కలిసి ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులతో సమావేశమై జాతర నిర్వహణపై సమీక్షించారు. ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి రానుండటంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అంతకు ముందు ఏసీపీ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఆంజనేయులు, సతీశ్, ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్, సభ్యులు ఆర్.బాలరాజు, ఎం.పెంటారెడ్డి, జీ.నర్సింహ, ఆర్.నర్సింహ, ఆర్.సత్తయ్య, డి.ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రతినిధులతో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఏసీపీ గంగారాం

గొరెలు చోరీ

దుండిగల్, జనవరి 18 : రైతు పొలంలోని గొరెలు చోరీకి గురైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బౌరంపేట గ్రామానికి చెందిన పర్స రమేశ్ వ్యవసాయంతోపాటు గొరెలు పెంచుతూ జీవనం సాగిస్తాడు. ప్రతి రోజులానే బుధవారం గ్రామానికి సమీపంలోని పొలంలోని దొడ్డిలో గొరెలు ఉంచి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా.. అందులో ఉండాల్సిన 25 గొరెలు కనిపించలేదు. పరిసరాల్లో వెతికినా వాటి ఆచూకీ దొరకలేదు. గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదైంది.

మద్యం మత్తులో దివ్యాంగుడు మృతి

జీడిమెట్ల, జనవరి 18 : ఓ చిరువ్యాపారి మూడు చక్రాల(దివ్యాంగుడు) సైకిల్‌లో మద్యం మత్తులో ఇరుక్కొని ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం చంద్రగిరినగర్‌కు చెందిన యాదగిరి(62) షాపూర్‌నగర్ ప్రధాన రహదారిలోని జీడిమెట్ల ఈఎస్ఐ ఆసుపత్రి ముందు మాస్కులు, ఇతర సామగ్రి విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అతడికి రోజూ మద్యం తాగే అలవాటు ఉన్నది. బుధవారం రాత్రి మద్యం సేవించాడు. ఆసుపత్రి ముందున్న మూడు చక్రాల సైకిల్ మీద కూర్చునే క్రమంలో ఒక్కసారిగా కిందపడిపోయి సైకిల్ మధ్యలో ఇరుక్కుపోయాడు. ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుల అరెస్ట్..

దుండిగల్, జనవరి 18 :సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్తులను పోలీసులు పట్టుకున్నారు. బాచుపల్లి పోలీసులు తెలిపిన మేరకు.. సూరారం కాలనీలో నివాసముండే కూరగాయల వ్యాపారం చేసే దేరంగుల రవి(21), కూలి పనిచేసే దేరంగుల భరత్, పెయింటర్‌గా పనిచేసే తన్నీరుసూరి(19) స్నేహితులు. వీరిలో చోరీలకు నాయకత్వం వహించే రవి 23, భరత్ 15 కేసుల్లో నిందితులు. సూరి హత్య, ఫోక్సోతో సహా 3 కేసుల్లో నిందితుడు. వీరు రాచకొండ, సైబరాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ నేరాలకు పాల్పడ్డారు. తాజాగా ఈనెల 5న బాచుపల్లి రేణుకాఎల్లమ్మ ఆలయంలో హుండీ దోచుకోవడంతో పాటు ఇండ్లల్లో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదుతో బాచుపల్లి క్రైం పోలీసులు వీరి కోసం గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో గురువారం సూరారం పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. అదుపులో తీసుకుని విచారించగా వివరాలు వెళ్లడయ్యాయి. వీరి నుంచి రెండు తులాల బంగారం, 35 తులాల వెండితోపాటు రూ.1.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. చెడు అలవాట్లకు బానిసైన వీరు తమ జల్సాలకు సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీల బాటపట్టారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులే!

- భారీ వాహనాలు నిర్ణీత వేళలు పాటించాలి
- సైబరాబాద్ ఇన్‌చార్జి ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌రావు

గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాదాపూర్ జోన్ ట్రాఫిక్ ఇన్‌చార్జి డీసీపీ శ్రీనివాస్‌రావు

శేరిలింగంపల్లి, జనవరి 18 : సైబరాబాద్ పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నిబంధనలను కఠినం చేస్తున్నట్లు మాదాపూర్